క్లుప్తంగా

ఉపాధి అవకాశాలపై ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు : మండలంలోని గోపవరంలోని ప్రభుత్వ పశువైద్య కళాశాలలో పశువులు, జీవాలు, కోళ్లు, కుందేళ్లు, పందులు, పాల ఉత్పత్తుల తయారీ వంటి అంశాల్లో ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించనున్నట్లు కళాశాల పశువైద్య విస్తరణ అధిపతి డాక్టర్ జి.త్రివేణి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఔత్సాహిక యువతీయువకులకు జూన్ 11, 12 తేదీల్లో రెండు రోజులపాటు శిక్షణ ఇస్తామని డాక్టర్ పేర్కొన్నారు. జూన్ 5వ తేదీలోపు డాక్టర్ సి.విజయకుమార్ సెల్‌నంబర్ 9676139556కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్సీ పరామర్శ



చెంచిరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి

బి.కోడూరు : మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండావెంకట్రామిరెడ్డి బావ ఓబుల్‌రెడ్డిచెంచిరెడ్డి (80) హఠాన్మరణం చెందడంతో మంగళవారం ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈయన వెంట సింగిల్‌విండో అధ్యక్షుడు ఓ.ప్రభాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఓ.వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

31న పర్యావరణ పరిరక్షణపై పోటీలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 'భూ పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువు స్థితి స్థాపకత', పర్యావరణ పరిరక్షణ అనే అంశాలపై ఈ నెల 31న విద్యార్థులకు వ్యాస రచన, ప్రసంగం, క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి , పర్యావరణ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కడప నగరంలోని కోటిరెడ్డి రామసుబ్బమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించే ఈ పోటీల్లో 6 నుండి 10 వ తరగతి వరకు, ఇంటర్మీడియట్ నుండి డిగ్రీ విద్యార్థుల వరకు రెండు విభాగాలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోటీలలో పాల్గొనదలచిన విద్యార్థులు వారి పేరు, విద్యా సంస్థ, తరగతి, ఫోన్ నెంబర్ తదితర వివరాలను 81794 54953 నెంబర్‌కు పంపాలని సూచించారు.

31 నుంచి హనుమాన్ జయంతి మహోత్సవాలు

వేంపల్లె : స్థానిక పాపాఘ్నినది ఒడ్డున ఎద్దుల కొండపై వెలసిన శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి అనుసంధానమైన ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 31నుంచి హనుమాన్ జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కురాకుల వెంకటేష్, అర్చకులు హరిప్రవీణ్‌లు తెలిపారు. 31వ తేదీన శుక్రవారం గణపతి పూజతో మొదలై ఆంజనేయస్వామి మూలవరులకు అభిషేకం, అలంకరణ ఆరాధన చేస్తారన్నారు. అనంతరం గణపతి హోమం, నవగ్రహ హోమం, లఘు పూర్ణాహుతి నిర్వహిస్తారన్నారు. జూన్ 1వ తేదీ శనివారం ఉదయం సుప్రభాతం, దేవత ఆరాధన, కలిషారాధన, మూర్తి హోమం, మహాపూర్ణాహుతి, తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

కమనీయం.. కల్యాణం

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలో వెలసిన శ్రీ గోదా, మహాలక్ష్మీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ చతుర్థశ వార్షికోత్సవ, బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి.

ఈ సందర్భంగా శ్రీ గోదా మహాలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణంను వైభవంగా నిర్వహించారు. రెండు రోజులు పాటు ఆలయంలో సుప్రభాత సేవతో పాటు వివిధ రకాల, అభిషేకాలు, హోమాలు జరిగాయి. శ్రీవారి కల్యాణం అనంతరం సాయంత్రం గ్రామోత్సవంను వైభవంగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

సుంకులమ్మకు ప్రత్యేక పూజలు

కమలాపురం : పట్టణ పరిధిలోని చెరువుకట్టపై వెలసిన శ్రీ వరాల సుంకులమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 27వ తేదీ నుంచి జరుగుతున్న సుంకులమ్మ తిరునాల మహోత్సవాన్ని పురస్కరించుకుని రెండోరోజు మంగళవారం అమ్మవారి మూల విగ్రహాలకు విశేష పంచామృత అభిషేకములు, మహాలక్ష్మీ, మహా సరస్వతి, నవగ్రహ మహా గణపతి పూజ, అభిషేకములు, అవాహిత హోమములు, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. సాయంత్రం ప్రదోశకాల పూజలు, పంచ అష్టోత్తరము, అమ్మవారికి కుంకుమార్చనలు, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. కాగా సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం



ప్రొద్దుటూరు క్రైం : అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హిమబిందు



ప్రొద్దుటూరు : పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శాంతకుమారి



మైదుకూరు : వనిపెంటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్, వైద్యాధికారులు

- రుతుక్రమం సాధారణం
- అది పూర్తిగా జీవసంబంధమైన చర్యే
- వైద్య నిపుణులు

మైదుకూరు : రుతుస్రావం సాధారణమేనని, అది పూర్తిగా జీవసంబంధమైన చర్యే అని వనిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి తేజ్‌దీప్ అన్నారు. రుతుక్రమం సమయంలో పరిశుభ్రత పాటించడంపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రుతుస్రావం విషయంలో పూర్వ కాలం నుంచి ఉన్న అపోహలను విడనాడాలని పేర్కొన్నారు. అంతర్జాతీయ రుతుక్రమం పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా వనిపెంటలో ఐసీడీఎస్, వైద్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తేజ్ దీప్ మాట్లాడుతూ రుతుస్రావాన్ని ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం లేదని, మహిళల్లో అది సర్వసాధారణమని పేర్కొన్నారు. అంటువ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలను నివారించేందుకు రుతుస్రావ సమయంలో పరిశుభ్రత పాటించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఓబుళమ్మ, వైద్య సిబ్బంది ప్రమీల, లక్ష్మి, ఇందిరాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

వరదాయపల్లెలో..

మండలంలోని జీవీ సత్రం ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని వరదాయపల్లెలో రుతుస్రావ పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. రుతుస్రావంపై మహిళల్లో అవగాహన కల్పించారు. జీవీ సత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌ఓ యోగేశ్వర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

ప్రొద్దుటూరు : స్థానిక స్వరాజ్యనగర్ సెక్టార్ పరిధిలో మంగళవారం కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. రుతు పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మానసిక మహోత్సవం-2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతకుమారి మాట్లాడుతూ మెన్సువల్ పిరియడ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, తినాల్సిన ఆహారం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి, సీఓ నాగజ్యోతి, మహిళా పోలీసు సంధ్య, సుహాసిని, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లుల, కిశోర బాలికలు పాల్గొన్నారు.

రుతు క్రమం సాధారణ ప్రక్రియ

ప్రొద్దుటూరు క్రైం : రుతుక్రమం గురించి కిశోర బాలికలు అవగాహన పెంచుకోవాలని డాక్టర్ హిమబిందు తెలిపారు. రుతుక్రమం ఆరోగ్యం, పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా టీబీరోడ్డులోని ఎస్సీ కాలనీలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ రుతుక్రమం అనేది మహిళల్లో జరిగే ఒక సాధారణ ప్రక్రియ అని చెప్పారు. ఈ సమయంలో సిగ్గు పడటం అవసరం లేదని, సాధారణంగా చేసుకునే ప్రతి పనిని చేసుకోవచ్చని చెప్పారు. బహిష్టు సమయంలో తగు విశ్రాంతి, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వ్యాయామం చేయడం వలన నెలసరి సమయంలో వచ్చే నొప్పి నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. అంటు వ్యాధులు నివారించడానికి బాలికలు శుభ్రత పాటించడం చాలా ముఖ్యమని చెప్పారు. ఈ కార్యక్రయంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సీఓ సుబ్బారెడ్డి, ఏఎన్‌ం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కల్లూరు సచివాలయం పరిధిలో..

కల్లూరు సచివాలయం పరిధిలోని కిశోర బాలికలకు రుతుక్రమం, పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ రాజశేఖర్, ఏఎన్‌ఎం మరియమ్మ, సీడీపీఓ అరుణకుమారి, సూపర్‌వైజర్ రఫియాబాను, జీఎంఎస్‌కే జ్యోతి, ఆశా వర్కర్లు లక్ష్మీదేవి, శ్యామల, పరమేశ్వరి, అమరావతి, కిశోర బాలికలు హాజరయ్యారు.

ఆరోగ్యం పరిశుభ్రతతో నిశాబ్దాన్ని ఛేదిద్దాం

ఖాజీపేట : ఆరోగ్యం పరిశుభ్రతతో నిశాబ్దాన్ని ఛేదిద్దామని ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర అధికారి డాక్టర్ ముబిన్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ రుతుక్రమం పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా ఖాజీపేటలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భనిర్ధారణ చేయడం చట్టవిరుద్ధమన్నారు. రుతుస్రావ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశా నోడల్ అధికారి అరుణకుమారి, సూపర్ వైజర్ శోభన్ బాబు, కృష్ణప్రియ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీదేవి, భారతి, రమాదేవితో పాటు స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

ఆడ పిల్లలు సమతుల ఆహారం తీసుకోవాలి

చాపాడు : ఆడ పిల్లలు నెలసరి సమయంలో ఐరన్, ప్రొటీన్ సమృద్ధిగా ఉండే మంచి సమతుల ఆహారం తప్పనిసరిగా తీసుకోవాలని మండల వైద్యాధికారి డా.రాజేష్‌కుమార్ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యక్రమంలో సీడీపీఓ సావిత్రమ్మ ఆధ్వర్యంలో రుతు క్రమం, ఆరోగ్య పరిశుభ్రత దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డా.కావ్యమాధురి, ముద్రాయిపల్లె, సోమాపురం గ్రామాలలో డా.శ్రీవాణి రుతుస్రావ, ఆరోగ్య పరిశుభ్రత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఆడ పిల్లలు రుతు క్రమ చర్యలతో పాటు ఆరోగ్య పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. శరీరంలో ఐరన్‌ను గ్రహించడానికి విటమిన్-సి కలిగిన ఆహారం తీసుకోవాలని, ప్రొటీన్స్ ఎక్కువగా ఉండే శాఖాహారం, మాంసహారం ఏదైనా తినవచ్చన్నారు. ఈ సమయంలో నీళ్లు ఎక్కువగా తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రాఘవయ్య, హెల్త్ సూపర్‌వైజర్‌లు బాబురెడ్డి, సరస్వతి, అంగన్వాడీ సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, సుబ్బరత్నమ్మ, ఏఎన్‌ఎం స్రవంతి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రుతుక్రమంపై బాలికలు అవగాహన కలిగి ఉండాలి

బద్వేలు అర్బన్ : రుతుక్రమమనేది బాలికల్లో ఒక సహజ ప్రక్రియ అని, దీనిపై బాలికలు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి, తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జె.వినయ్‌కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక కోటవీధి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రుతుక్రమ సమయంలో బాలికలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోవాలన్నారు. పరిశుభ్రత, సరైన నెలవారీ ఏర్పాట్లను అవలంబించడం ద్వారా రుతుస్రావంపై ఉన్న అపోహలను తొలగించవచ్చన్నారు. అలాగే నెలసరి సమయంలో వచ్చే కడుపునొప్పికి వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని సూచించారు. అలాగే నెలవారీ సమయంలో విశ్రాంతితో పాటు ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని, ఇది శరీరంలో రక్తహీనతను నివారిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అరుణ, సుబ్బలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, మహిళా సంరక్షణ కార్యదర్శి మల్లీశ్వరి, ఏఎన్‌ఎంలు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



బి.కోడూరు : రుతుక్రమంపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



బద్వేలు అర్బన్ : రుతుక్రమంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

బి.కోడూరు : కిశోర బాలికలు, మహిళలు రుతుక్రమ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు సూచించారు. మంగళవారం అంతర్జాతీయ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవాన్ని వైద్యాధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొటీన్లు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగమణి, హెల్త్ సూపర్‌వైజర్ జాన్‌విలియం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో..

అంతర్జాతీయ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పాయలకుంట్ల అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ మాట్లాడుతూ కిశోర బాలికలు రుతుక్రమంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌంటింగ్ నిబంధనలు పాటించాల్సిందే



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.చంద్రమోహన్

మైదుకూరు : ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాల్సిందేనని మైదుకూరు నియోజకవర్గ అధికారి ఎస్.చంద్రమోహన్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఎన్నికల కౌంటింగ్‌పై అన్ని పార్టీల అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లతో ఆయన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్‌లో పాల్గొనే రాజకీయ పార్టీల, ఇండిపెండెంట్ అభ్యర్థుల కౌంటింగ్ ఏజెంట్లు నిబంధనలను పాటించి సహకరించాలని కోరారు. జూన్ 4న జరిగే కౌంటింగ్‌లో పోస్టల్ బ్యాలెట్లు, ఈవీఎం కౌంటింగ్ నందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు తెలియజేశారు. సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారి వై.నరేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయండి

నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్.చంద్రమోహన్ ఆదేశించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇతర శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ నియోజకవర్గంలో నిర్వహించే స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అందిన విజ్ఞప్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అన్ని మండలాల్లో నిర్మాణంలో ఉన్న పక్కా ఇళ్లను పూర్తి చేయాలని సూచించారు. ఇతర అభివృద్ధి పనులను కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ మరో ప్రత్యేక అధికారి నందన్ పాల్గొన్నారు.

హద్దు మీరితే చర్యలు తప్పవు



చాపాడు: సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశులు



బద్వేలు అర్బన్ : సూచనలిస్తున్న డీఎస్పీ రవికుమార్

బద్వేలు అర్బన్ : జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నియోజకవర్గ పోలీస్ నోడల్ ఆఫీసర్, డీఎస్పీ కె.రవికుమార్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక అర్బన్ స్టేషన్ ఆవరణలో పట్టణంలోని ఆయా రాజకీయ పార్టీల నాయకులకు, ట్రబుల్ మాంగర్స్‌కు, రూరల్ స్టేషన్ ఆవరణలో బద్వేలు రూరల్, గోపవరం, అట్లూరు, బి.కోడూరు మండలాల పరిధిలోని నాయకులకు, ట్రబుల్‌మాంగర్స్‌కు వేరువేరుగా కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత ఎలాంటి ర్యాలీలు ఊరేగింపులు చేసినా, బాణాసంచా పేల్చినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో పాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎక్కడైనా జనం గుమికూడితే చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే గొడవలు, కేసుల్లో ఉన్న వ్యక్తులపై నిఘా ఉంచామని, అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తే నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐలు విక్రమసింహ, యుగంధర్, ఎస్ఐలు సత్యనారాయణ, రవికుమార్, కె.సి.రాజు, జయరాములు తదితరులు పాల్గొన్నారు.

144 సెక్షన్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

చాపాడు : వచ్చే నెల 4న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందని దీనిని ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ వెంకటేశులు అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్ వద్ద మంగళవారం సాయంత్రం ఎస్ఐ ఆర్‌వీ కొండారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ వర్గీయులతో ఎన్నికల కౌంటింగ్ నిబంధనలు, గ్రామాల్లో 144 సెక్షన్ అమలుపై సమావేశం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ రోజున 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఈ క్రమంలో ఎలాంటి ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదని, బాణాసంచా కాల్చరాదన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన నాయకులు తమ కార్యకర్తలను అదుపులో ఉంచుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

గణితశాస్త్రం నిత్య జీవితంలో అవసరం



చాపాడు: గణితంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయ అధికారి శివశంకర్‌రెడ్డి



అట్లూరు: విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయ అధికారి ఎం.సుధాకర్

చాపాడు : సమాజంలో గణితశాస్త్రానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, అది నిత్యజీవితంలో ఎంతో అవసరం అని గ్రంథాలయ అధికారి శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు గణితంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ వేసవి తరగతులలో భాగంగా 20 మంది విద్యార్థులకు పది రోజులుగా ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రోజూ ఒక అంశంపై విద్యార్థులకు బోధించటం జరుగుతుందన్నారు. చదువుతో పాటు కథలు, పుస్తకాలు చదువటం, అల్లికలు నేర్పించటం, చిత్ర లేఖనం గీయించటం ఇలా అనేక రకాలైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని గ్రంథాలయ అధికారి తెలిపారు.

విద్యతో పాటు యోగా తప్పనిసరి

అట్లూరు : విద్యార్థులకు విద్యతో పాటు యోగా కూడా తప్పనిసరి అని గ్రంథాలయ అధికారి ఎం. సుధాకర్ పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా 6,7,8. తరగతుల విద్యార్థులకు వ్యాయామం, యోగాతో పాటు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జూన్ 7వ తేదీన బహుమతులు ప్రధానం చేస్తామని తెలిపారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మైదుకూరు రోడ్డులోని నాగార్జున ఐటీఐలో మంగళవారం ఐల్ డిక్సన్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. మొత్తం 45 మంది నిరుద్యోగ అభ్యర్థులను కొప్పర్తి సమీపంలోని టెక్నాలజీస్ కంపెనీకి ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ సుబ్బారావు తెలిపారు. వీరిని విద్యార్హత, అనుభవం ఆధారంగా ఎంపిక చేశామని తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు వంశీ, పవన్, శివ పాల్గొన్నారు.

నేడు కుచ్చుపాపలో వైద్య శిబిరం

చాపాడు : మండల పరిధిలో కుచ్చుపాప గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి కావ్య మాధురి తెలిపారు. గ్రామంలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ గ్రామంలోని ప్రజలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

ఖరీఫ్‌కు రైతులను సమాయత్తం చేయండి



మాట్లాడుతున్న ఏడీఏ నాగరాజు, వ్యవసాయ అధికారి చంద్రమోహన్‌రెడ్డి

అట్లూరు : ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసుకునేందుకు సమాయత్తం చేయాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు పేర్కొన్నారు.

బద్వేలు వ్యవసాయ డివిజన్ కార్యాలయంలో వ్యవసాయ అధికారి చంద్రమోహన్‌రెడ్డితో కలసి మంగళవారం బద్వేలు మండల పరిధిలోని రైతు భరోసా సహాయకులతో సమీక్షా మరియు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పచ్చిరొట్ట, ఎరువులు సరఫరాపై చర్చించారు. పక్కృతి వ్యవసాయ సిబ్బందితో కలసి పనిచేసి.. రైతుల సంఖ్యతో పాటు విస్తీర్ణం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా సహాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి మైఖేల్ రాజీవ్

దువ్వూరు : ఎన్నికల కోడ్ అమలుకు ముందు పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి మైఖేల్ రాజీవ్ తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో అన్ని శాఖల మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని, గృహ నిర్మాణాల లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తెలిపారు. జగనన్న కాలనీలో నీటి, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న పనులను త్వరగా పూర్తి చేసి వచ్చే నెల పాఠశాలలు తెరిచేలోపు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మండలంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామ పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీఓ సుగణ శ్రీ, మండల ఇంజనీర్లు సుబ్రహ్మణ్యం, శివకుమార్, ట్రాన్స్‌కో ఏఈ వీరారెడ్డి, ఎంఈఓ భాస్కర్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుందూ తీరం.. ఆహ్లాదకరం

భానుడి వేడిమి తాళలేని వారికి కుందూ సేద తీరుస్తోంది. వరుణుడు కరుణ చూపడంతో కుందూ నదిలో గలగల పారే నీటి ప్రవాహం.. పచ్చదనం ఉట్టిపడేలా నది సమీపంలో కొర్ర, మొక్కజొన్న, వేరుశనగ పంటలు.. ఇప్పుడే చిగురించినట్లుగా పచ్చిక బయళ్లు.. యువకులు, చిన్నారుల జలకాలాట.. దాహార్తి తీర్చుకుంటున్న మేకలు, గొర్రెలు.. వెరసి పల్లె వాతావరణం కుందూ నదీ తీరంలో ఎవరినైనా కట్టిపడేస్తుంది. సెలవు దినాల్లో నదీ తీరంలో అందాలను ఆస్వాదించవచ్చు.

– రాజుపాళెం



కొట్టాల గ్రామం వద్ద పచ్చదనం నిండిన కొర్ర పంట



చల్లదనం కోసం నీటిలో దిగుతున్న మేకలు, గొర్రెలు



టంగుటూరు వద్ద నదిలో నీటి గలగలలు

గజవాహనంపై చెన్నకేశవుడు



గజవాహనంపై శ్రీదేవిభూదేవి సమేత చెన్నకేశవుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీమహాలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున చెన్నకేశవస్వామి, మహాలక్ష్మీదేవిల మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా నూతన పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలతో అలంకరించారు. సాయంత్రం స్వామివారిని గజవాహనంపై శ్రీదేవిభూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను పురవీధుల్లో గోవింద నామ స్మరణల మధ్య ఘనంగా ఊరేగించారు. దారివెంబడి భక్తులు కాయాకర్పూరాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. కాగా బుధవారం ఉదయం చెన్నకేశవస్వామి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు.